

ఇద్దరు డీఎస్పీలు బదిలీ


ఉపేంద్రబాబు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.ఉపేంద్రబాబును కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డీఎస్పీగా బదిలీ చేశారు. అనకాపల్లి డీటీసీ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును విజయనగరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఈ రెండు స్థానాల్లోకి ఇంకా ఎవరినీ నియమించలేదు

ఆర్ అండ్ బీ నిర్లక్ష్యం

పునరుద్ధరణకు నోచుకోని తాచేరు డైవర్షన్ రోడ్డు


విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై పునరుద్ధరణకు నోచుకోని డైవర్షన్ రోడ్డు

- పది రోజుల క్రితం భారీ వర్షాలు, వరదలతో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- నదిలో వరద తగ్గి ఐదు రోజులైనా పట్టించుకోని అధికారులు
- ఆర్టీసీ బస్సులు దారి మళ్లింపు, రూట్ల కుదింపు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మూడు జిల్లాల ప్రజలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15:

రాష్ట్రంలో ప్రభుత్వం మారి మూడు నెలలు దాటినప్పటికీ కొన్ని ప్రభుత్వ శాఖల్లో పాత ప్రభుత్వ వాసనలు ఇంకా పోలేదు. ప్రజా సమస్యలపై గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే నిర్లిప్తత, తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇందుకు బీఎన్ రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం తాచేరుపై డైవర్షన్ రోడ్డు ఒక ఉదాహరణ. తాచేరు వరద ఉధృతికి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి ఎనిమిది రోజులు అవుతున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు ఇంతవరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదు.

భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో గత ఏడాది అక్టోబరు నెలలో కూలిపోయింది. వాస్తవంగా చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం సరిహద్దు వరకు బీఎన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ఇక్కడ కొత్త వంతెన నిర్మించాల్సి వుంది. వివిధ కారణాల వల్ల రోడ్డు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాచేరుపై కొత్త నిర్మాణం చేపట్టకముందే పాత వంతెన కూలిపోవడంతో అధికారులు తాత్కాలికంగా సిమెంట్ తూములు వేసి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఈ రోడ్డు మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాచేరు నదిలో వరద ఉధృతి పెరగడంతో 8వ తేదీన విజయరామరాజుపేట వద్ద తాత్కాలిక డైవర్షన్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి, తూములు బయటపడ్డాయి. మూడు జిల్లాలకు (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారాయి. ముఖ్యంగా ఆర్టీసీ అధికారులు మాడుగుల, పాడేరు, చోడవరం, తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులను రోజుల తరబడి రద్దు చేయడంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. విశాఖ, అనకాపల్లి, చోడవరం వైపు నుంచి మాడుగుల, పాడేరు వైపు, చోడవరం నుంచి నర్సీపట్నం, రావికమతం, రోలుగుంటవైపు వెళ్లేవారితోపాటు బుచ్చెయ్యపేట మండలంలో విజయరామరాజుపేట, కుముందాంపేట, మంగళాపురం, చీడికాడ మండలానికి చెందిన పది గ్రామాల ప్రజలకు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో వున్న వడ్డాది కూడలికి చేరుకోవాలంటే గౌరీపట్నం, కస్పా రోడ్డు మీదుగా 13 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. తాచేరు నదిని నడుచుకుంటూ దాటడానికి కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. నదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టి ఐదు రోజులైయినా ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులపై దృష్టి సారించలేదు.

ఆర్టీసీ బస్సులు దారి మళ్లింపు, కుదింపు

విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో ఆర్టీసీ అధికారులు కొన్ని సర్వీసులను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడుపుతుండగా, మరికొన్నింటి దూరాన్ని కుదించారు. నర్సీపట్నం-చోడవరం మధ్య నడిచే బస్సులను వడ్డాది వరకే నడుపుతున్నారు. ప్రయాణికులు ఇక్కడి నుంచి ఆటోల్లో చోడవరం, ఆపైన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది. అదే విధంగా ... మిగతా 8వ పేజీలో

ఒకేసారి రెండు డిగ్రీలు

ఏయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు



విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు కోర్సులు ఒకేసారి పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం

- ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యం
- నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రారంభం
- ఇప్పటికే ఇంజనీరింగ్‌లో మిగిలిన బ్రాంచీల విద్యార్థులకు మూడో ఏడాది సీఎస్ఈ చేసేందుకు వెసులుబాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్న వారికి ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. దీనికి కారణం విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో నైపుణ్యాలు లేకపోవడమేనని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం-2020 పేరుతో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఒకేసారి విద్యార్థి రెండు డిగ్రీలు పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే జాతీయ వర్సిటీల్లో ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, రాష్ట్ర యూనివర్సిటీల్లోనూ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏయూ అధికారులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీలో డ్యూయల్ డిగ్రీ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అంటే ఒకేసారి రెండు పీజీ కోర్సులు పూర్తిచేసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించనున్నారు. విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేసేందుకు అవకాశం లభించనుంది. ఉదాహరణకు ఎంఏ పాలిటిక్స్ చేసే విద్యార్థి ఈ కోర్సు చదువుతూనే, ఎం.కామ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ రెండు కోర్సులను ఒకేసారి పూర్తిచేసి ఒకవైపు ఎంఏ పాలిటిక్స్, మరోవైపు ఎంకామ్ డిగ్రీలను పొందవచ్చు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ సెనేట్ ఆమోదం కోసం వేచి చూస్తున్నామని, అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

కోర్సులు డిజైన్ చేసే యోచన

డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని భావిస్తున్న ఏయూ అధికారులు ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే కోర్సులను డిజైన్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు డిగ్రీలతో బయటకు వెళ్లిన వెంటనే ఏదో ఒక డిగ్రీ పట్టాతో ఉద్యోగం లభించేలా డిజైన్ చేయబోతున్నారు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కోర్సులు డిజైన్, సబ్జెక్టులు, పరీక్షలు నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన కరసత్తు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. రెండు మేజర్ సబ్జెక్టులు పూర్తిచేసినట్టుగానే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నారు.

విద్యార్థులకు మేలుతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగు

- ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఏయూ వైస్ చాన్సలర్



డ్యూయల్ డిగ్రీ విధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఒకేసారి రెండు ప్రధానమైన డిగ్రీలను పొందడం వల్ల మార్కెట్‌లో ఏ డిగ్రీకి డిమాండ్ ఉందో దానికి సంబంధించిన ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల నిరుద్యోగం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో విద్యార్థులకు విభిన్న అంశాలపై నాలెడ్జ్ పెరుగుతుంది. ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థులకు మేజర్, మైనర్ కాన్సెప్ట్‌తో ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు మైనర్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ సైన్స్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాం. వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సుల్లో అమలు చేయాలని భావిస్తున్న డ్యూయల్ డిగ్రీ విధానంలో మాత్రం రెండు కోర్సులు సబ్జెక్టులు మేజర్‌గానే ఉంటాయి.

ఇంజనీరింగ్‌లో అమలు..

ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రస్తుతం డ్యూయల్ డిగ్రీ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే, పేరెంట్ ... మిగతా 8వ పేజీలో

ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

ఏ సమస్య ఉన్నా 1912కు కాల్ చేస్తే చాలు

- పీఎం జన్‌మన్‌లో ఆదివాసీలకు విద్యుత్ సరఫరా
- 'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్


ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టాలనే నిబంధన అమలు చేస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గతంలో వేసవి సీజన్‌కు ముందు ఈ నిర్వహణ పనులు జరిగేవన్నారు. అయితే ఏడాది మొత్తం వదిలేసి, సీజన్‌లోనే చేయడం వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించి, ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్‌పై పడితే వెంటనే ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతుందని, దీనిని సరిచేయడానికి గంటల సమయం పడుతోందన్నారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా పది నిమిషాలు ఆగినా భరించలేని స్థితిలో వినియోగదారులు ఉన్నందున అసలు ఆ సమస్యే రాకుండా ముందుజాగ్రత్తగా ఇలా ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేయిస్తున్నామన్నారు. దీనివల్ల ట్రిప్ సమస్యతో విద్యుత్ ఆగిపోయే ఘటనలు తగ్గుతున్నాయన్నారు. డిస్కమ్‌లోని అన్ని సర్కిళ్లలోను దీనిని అమలు చేస్తున్నామన్నారు.

150 ప్రాంతాల్లో పీఎం జన్‌మన్ వెలుగులు

ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా కొండల్లో నివసించే కొన్ని గిరిజన గ్రామాలకు విద్యుత్ లైన్లు వేయలేని పరిస్థితి ఉందన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు కొండలపై నివాసాలను మార్చుకునే ఆదిమ జాతి గిరిజనులకు విద్యుత్ వెలుగులు అందించేందుకు పీఎం జన్‌మన్ పథకం అమలు చేస్తుండగా, అందులో సుమారు 150 మంది గిరిజన కుటుంబాలకు సోలార్‌తో పనిచేసే విద్యుత్ బల్బులు, ఫ్యాన్, చార్జింగ్ పాయింట్ వంటివి అందించామన్నారు. ఇవన్నీ ఒక ప్యాకేజీ కింద ఉంటాయని, ఒక్కొక్కటి రూ.50 వేలు విలువ చేస్తుందన్నారు. కేవలం సూర్యకాంతితోనే ఇవి పనిచేస్తాయన్నారు.

సేవల్లో లోపం లేకుండా చూస్తున్నాం

డిస్కమ్‌లో ఉండాల్సిన సిబ్బందిలో మూడో వంతు ... మిగతా 8వ పేజీలో


సాగునీటికి రైతుల పాట్లు

అధ్వానంగా కాలువలు, మదుములు

నిర్వహణ పనులను గాలికొదిలేసిన వైసీపీ పాలకులు

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తుప్పలు
- శిథిలావస్థకు చేరిన స్లూయిస్‌లు
- పలుచోట్ల ధ్వంసమైన రెగ్యులేటింగ్ గేట్లు
- 16 వేల ఎకరాలకు ప్రశ్నార్థకంగా సాగునీరు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు


గుంటపల్లి కాలువపై ఆనవాళ్లు లేని స్లూయిస్


కేశవరం వైపు నీరు వెళ్లే కాలువపై గేటు లేని స్లూయిస్

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 15:

మండలంలోని సాగునీటి కాలువల నిర్వహణ అధ్వానంగా వుంది. దాదాపు ఐదేళ్ల నుంచి పూడికలు తీయలేదు... తుప్పలు తొలగించలేదు. మదుముల (స్లూయిస్) గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రెగ్యులేటింగ్ గేట్లు విరిగిపోయాయి. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో ఆయకట్టు పొలాలకు నీరు సరిగా అందడంలేదు. కాలువల్లో పూడిక తీయించి, మదుములు, గేట్లను బాగు చేయించాలని జలవనరుల శాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేట మండలంలో తాండవ నదిపై నిర్మించిన మినీ ఆనకట్టల నుంచి భూమి కాలువ, ముఠా కాలువ, ఆవ కాలువలు, అనుబంధ చెరువుల ద్వారా గుంటపల్లి, మంగవరం, అరట్లకోట, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, మాసాహెబ్‌పేట, శ్రీరాంపురం, కేశవరం, రాజవరం, వెంకటనగరం, ఎస్.నర్సాపురం తదితర గ్రామాల్లో సుమారు 16 వేల ఎకరాలకు నీరు అందుతుంది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు నిధులు మంజూరై సాగునీటి సంఘాల ద్వారా కాలువల్లో పూడిక తీయించేవారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన కాలువలు, ఉప కాలువల్లో ఒక్కసారి కూడా నిర్వహణ (పూడికతీత) పనులు చేపట్టలేదు. దీంతో ఏటేటా కాలువల్లో పూడిక పేరుకుపోయి, తుప్పలు పెరిగిపోయాయి. ఫలితంగా ... మిగతా 8వ పేజీలో


తలుపులులేని మంగవరం కాలువ మదుము

కాలువల్లో పూడిక తీసి, కొత్త మదుములు నిర్మించాలి

- అల్లు వెంకటేశ్వరరావు, రైతు, మంగవరం



మంగవరం కాలువపై ఉన్న మదుము (స్లూయిస్) చాలా కాలం క్రితం మరమ్మతుకు గురైంది. గోడలు పూర్తిగా శిథిలమై తలుపులు ఊడిపోయాయి. దీనివల్ల పిల్ల కాలువలకు నీరు ఎక్కడంలేదు. మా పొలాలకు నీరు రావడంలేదు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా స్పందించి, సాగునీటి కాలువల్లో పూడికలు తీయించి, కొత్త మదుములు నిర్మించి, గేట్లు ఏర్పాటు చేయించాలి.

పుష్ప, ఫల అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



వినాయక చవితి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన ఆదివారం చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు పుష్ప, ఫల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి పుష్ప, ఫల అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు.

- చోడవరం

నేడు దుర్గ్-విశాఖ వందేభారత్ రైలు ప్రారంభం



- ఈ నెల 20 నుంచి రెగ్యులర్ సర్వీసులు
- గురువారం మినహా మిగిలిన ఆరు రోజులు అందుబాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 15: దుర్గ్-విశాఖతోపాటు దేశవ్యాప్తంగా మరికొన్ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. విశాఖ-దుర్గ్ మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నది. ఈ సర్వీసులు గురువారం మినహా వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తాయి. దుర్గ్-విశాఖ (నంబరు 20829) రైలు ప్రతి ఆది, సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాల్లో ఉదయం 5.45 గంటలకు దుర్గ్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖ చేరుతుంది. అదే రైలు నంబరు 20830తో విశాఖలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్ చేరుతుంది. 16 కోచ్‌లతో నడిచే ఈ రైలు రాయపూర్, మహా సముంద్, ఖరియార్ రోడ్డు, కంటాబంజి, టిట్లాఘర్, కెసింగ, రాయగడ, పార్వతీపురం, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

విశాఖ నుంచి నాలుగో వందేభారత్ రైలు

విశాఖ నుంచి ప్రస్తుతం మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుండగా, విశాఖ-దుర్గ్ మధ్య కొత్తగా ప్రవేశపెట్టే రైలు నాలుగోది కావడం విశేషం. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రెండు రైళ్లు, విశాఖ-భువనేశ్వర్ మధ్య ఒకటి నడుస్తుండగా, నాలుగో రైలు విశాఖ-దుర్గ్-విశాఖ మధ్య అందుబాటులోకి రానుంది.

పొంగిన ఉప్పుటేరు

- నీట మునిగిన అమలాపురం బీచ్ రోడ్డు
- రాకపోకలకు మత్స్యకారుల ఇబ్బందులు


ఉప్పుటేరు వరదతో నీటి మునిగిన అమలాపురం నుంచి సముద్ర తీరానికి వెళ్లే రోడ్డు

నక్కపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు, గ్రామస్తులు సముద్రం ధగ్గరకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఉప్పుటేరులోకి భారీగా నీరు చేరింది. దీంతో అమలాపురం గ్రామం నుంచి ఉప్పుటేరు మీదుగా సముద్ర తీరానికి వెళ్లే రహదారి మునిగిపోయింది. వరద ప్రవాహంతో రహదారి దెబ్బతిన్నది. దీంతో అమలాపురం, మూలపర్ర గ్రామాల మత్స్యకారులు, ఇతరులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపైనా వెళ్లడానికి వీలు కావడంలేదు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వడ్డాది వాసి దుర్మరణం


మృతి చెందిన అప్పారావు(ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న వడ్డాదికి చెందిన ఓ వ్యక్తి పెద్దాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వడ్డాదిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

వడ్డాది రెల్లి కాలనీకి చెందిన భూపతి అప్పారావు (41) పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గుంటూరులో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనడానికి వడ్డాది నుంచి బృందంతో కలిసి వెళ్లాడు. శనివారం సాయంత్రం పత్తిపాడు దగ్గర ధర్మవరం సెంటర్‌లో టిఫిన్ చేయడానికి రోడ్డుపై నడిచి వెళుతున్న అప్పారావును కారు బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అప్పారావును పెద్దాపురం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వైద్యుల సిఫార్స్ మేరకు కాకినాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జీవనోపాధికి వెళ్లి అప్పారావు మృతి చెందడంపై భార్య, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి


మృతుడు అప్పలరాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 : ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ వాచ్‌మన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఎండాడ వివేకానందనగర్ పార్కు సమీపంలో సాయితేజ అపార్ట్‌మెంట్‌లో పొట్నూరు అప్పలరాజు (35) వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్ మీద ఎండాడ పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకుని బంక్ నుంచి వస్తూ అక్కడికి సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం ముందు మెట్లపై మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పలరాజు స్వగ్రామం అనకాపల్లి సమీపంలోని తిరువూరు. అతనికి భార్య భవానీ, ఎనిమిదేళ్ల కుమార్తె ఉన్నారు. సాయితేజ అపార్ట్‌మెంట్‌లో ఆయన కొన్నేళ్లుగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం

నర్సీపట్నం, సెప్టెంబరు 15 : కట్టుకున్న భార్యను హత్య చేసేందుకు భర్త కత్తితో పొడిచిన ఘటన నర్సీపట్నం వెలమవీధిలో చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వెలమవీధిలో నివాసం ఉంటున్న కర్రెడ్ల వెంకటగణేశ్వరరావు భార్య సత్యవతిని మానసికంగా, శారీరంగా తరచూ వేధించేవాడని, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకు రమ్మని కొట్టేవాడని ఎస్‌ఐ తెలిపారు. శనివారం రాత్రి భార్యను చంపాలన్న ఉద్దేశంతో వెంకటగణేశ్వరరావు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడన్నారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, ఆమె తల్లి పి.రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సరియాలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

- వెలికితీసిన ఏపీఎస్‌ఆర్‌డీఎఫ్, అగ్నిమాపక, నేవీ బృందాలు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


సాయికుమార్ మృతదేహం


దిలీప్‌కుమార్ (ఫైల్ ఫొటో)

అనంతగిరి, సెప్టెంబరు 15: సరియా జలపాతంలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. శనివారం సాయంత్రం ఆ యువకులు గల్లంతుకాగా, ఆదివారం ఉదయం నుంచి జలపాతం వద్ద ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్, నేవీ, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీనికి సంబంధించి అనంతగిరి ఎస్‌ఐ కరక రాము, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం అందించిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలంలోని జీనబాడు పంచాయతీ పరిధిలో ఉన్న సరియా జలపాతాన్ని తిలకించేందుకు విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టకు చెందిన లంక సాయికుమార్ (33) మరో ముగ్గురు స్నేహితులతోను, బిహార్ రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ (31) తోటి ఉద్యోగులతోను కలిసి జలపాతం తిలకించేందుకు శనివారం వచ్చారు. లంక సాయికుమార్ బహుబలి జలపాతం వద్ద స్నానం చేస్తుండగా ఒక్కసారిగా లోతైన ప్రదేశం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీన్ని గమనించిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సాయికుమార్‌తో పాటు దిలీప్ కూడా గల్లంతయ్యాడు. శనివారం రాత్రి వరకు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం ఎస్‌ఐ రాము, డీటీ మాణిక్యం పర్యవేక్షణలో ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్, నేవీ, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో జలపాతం డేంజర్ పాయింట్ వద్ద దిలీప్‌కుమార్ మృతదేహం, 2.30 గంటల సమయంలో బాహుబలి జలపాతం వద్ద లంక సాయికుమార్ మృతదేహం లభ్యమయ్యాయి. అతి కష్టమ్మీద రెండు మృతదేహాలను బయటకు తీసి, తాడు సాయంతో గెడ్డను దాటించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

కన్నీరుమున్నీరైన కుటుంబీకులు, బంధువులు

లంక సాయికుమార్, దిలీప్‌కుమార్ మృతి చెందారని తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సరియా జలపాతం వద్దకు చేరుకున్నారు. సాయికుమార్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబానికి దిక్కు ఎవరంటూ రోదించడం చూసిన వారు కూడా కంట తడి పెట్టారు. అలాగే దిలీప్‌కుమార్ మృతదేహం వద్ద తోటి ఉద్యోగులు కన్నీరు పెట్టారు. సరదాగా గడిపేందుకు వచ్చి, మృత్యువాత పడడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్‌ఐలు శంకరరావు, లక్ష్మీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరంపై పోలీసులు కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : సైబర్ క్రైమ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయక కథనం ప్రకారం వివరాలివి. పట్టణంలోని గవరపాలేనికి చెందిన మళ్ల పవన్ మణికంఠ ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థలో ఉద్యోగానికి ఇటీవల పరీక్ష రాశాడు. అయితే ఈ ఏడాది జనవరి 31వ తేదీన మణికంఠకు సదరు కంపెనీ పేరు మీద అజ్ఞాత వ్యక్తి వాట్సాప్‌లో యాడ్ చేశాడు. దీంతో తాను పరీక్ష రాసిన కంపెనీయే అని నమ్మాడు. పార్ట్ టైమ్ జాబ్ కల్పిస్తామని అజ్ఞాత వ్యక్తి మెసేజ్ పెట్టగా ఆయన పంపిన లింక్‌లో బయోడేటా పంపించాడు. వెయ్యి రూపాయలు పంపమని వాట్సాప్‌లో కోరగా మణికంఠ సదరు వ్యక్తి సూచించిన అకౌంట్‌కు ఆ మొత్తం వేశాడు. వెనువెంటనే అజ్ఞాత వ్యక్తి మణికంఠను నమ్మించడానికి తిరిగి రూ.1400 వేయడంతో బాగుందని భావించాడు. దఫదఫాలుగా రూ.లక్షా 80వేలు వేసినప్పటికీ అట్నుంచి ఎటువంటి సమాధానం రాకపోగా, ఇంకా డబ్బులు పంపాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చి ఫిబ్రవరి ఒకటో తేదీన సైబర్ క్రైమ్‌కు ఫోన్ చేశాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు మణికంఠ పంపిన మొత్తంలో రూ.లక్షా 20వేలను అజ్ఞాత వ్యక్తి అకౌంట్‌కు మళ్లకుండా ఫ్రీజ్ చేశారు. ఈ సంఘటనపై శనివారం రాత్రి బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544


పార్కు ప్రాంగణం


పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

నందన వనం.. ఆహ్లాదభరితం

- ఈ.బోనంగి పంచాయతీ ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు
- పిల్లలకు ఆట పరికరాలు.. పెద్దలకు ఓపెన్‌జిమ్‌తో నిత్యం సందడి


పిల్లల ఆడుకునేందుకు పరికరాలు

పరవాడ, సెప్టెంబరు 15 : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన ఉద్యానవనం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తోంది. సుమారు 80 సెంట్లకు పైగా స్థలంలో పంచాయతీ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి ఆకట్టుకునే విధంగా పార్కును తీర్చిదిద్దారు. కడియం నుంచి మొక్కలు, పచ్చగడ్డి తీసుకువచ్చి పార్కు లోపల పెంచారు. కూర్చోవడానికి బెంచీలు, వెలుగుల నిమిత్తం ఎల్‌ఈడీ, హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. పార్కు మధ్యలో బాతుల బొమ్మలను పెట్టి తీర్చిదిద్దిన ఫౌంటైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పెద్దల కోసం ఓపెన్‌జిమ్, పిల్లలు ఆడుకోవడానికి సామగ్రిని ఏర్పాటు చేశారు. నడక కోసం ఉద్యానవనం చుట్టూ నడకదారిని తీర్చిదిద్దారు. తాగునీటి సదుపాయాన్ని కూడా కల్పించారు. కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, పిల్లలకు, వృద్ధులకు అందుబాటులో ఉండే విధంగా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కును నిర్మించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలతో కాసేపు ఆహ్లాదం పొందడానికి వీలుగా కాలనీలో పార్కును ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని అంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు సేద తీరేందుకు పార్కు ఎంతగానో ఉపయోగపడుతుంది.

నక్కపల్లిలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి

- కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్


రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 15 : విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో భూములిచ్చిన నిర్వాసిత రైతుల సమస్యలు తెలుసుకోవడానికి ఈ నెల 17వ తేదీ మంగళవారం నక్కపల్లిలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. చందనాడ సమీపంలో ఆదివారం సాయంత్రం కారిడార్ నిర్వాసిత రైతులతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 17న కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలు తెలుసుకోవడానికి హోం మంత్రి అనిత, కలెక్టర్‌తో అనకాపల్లిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని తొలుత చెప్పారన్నారు. కానీ హోం మంత్రి, కలెక్టర్‌కు బదులుగా ఆర్‌డీవో, ఎస్‌డీసీ స్థాయి అధికారులతో అనకాపల్లిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం తగదని పేర్కొన్నారు. ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న ఎంతో మంది నిర్వాసిత రైతులకు ఇంకా పరిహారం, ప్యాకేజీ రాలేదని, గృహాలకు సంబంధించి పరిహారం కూడా ఇవ్వలేదని తెలిపారు. అటువంటప్పుడు రైతులంతా కలిసి అనకాపల్లి రావడం కష్టమవుతుందన్నారు. అందువల్ల ఎస్‌డీసీ, ఆర్‌డీవో, తహసీల్దార్లు, ఏపీఐఐసీ అధికారులతో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ కార్యాచరణ ప్రణాళికను తామే రూపొందించుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రతినిధులు గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్, వెలగా ఈశ్వరరావు, తళ్లా భార్గవ్, ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాల్‌గున్ని సస్పెన్షన్‌పై విశాఖలో కలకలం

- 2013లో నర్సీపట్నం ఏఎస్పీగా గున్ని కెరీర్ ప్రారంభం
- ముంబైకి చెందిన సినీ నటి జత్వానీ ఫిర్యాదు మేరకు వేటు
- విశాల్ సస్పెన్షన్ స్వయంకృతాపరాధమేనని జోరుగా చర్చ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్ నగర పోలీస్ వర్గాల్లో కలకలం రేపింది. ముంబైకి చెందిన సినీ నటి కాదంబరీ జత్వానీ ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు ముగ్గురు పోలీస్ ఉన్నతాధికారులపై కేసు నమోదుచేశారు. వారిలో విశాల్ గున్ని ఒకరు. 2010 కేడర్‌కు చెందిన విశాల్ 2013లో నర్సీపట్నం ఏఎస్పీగా కెరీర్ ప్రారంభించారు. రెండేళ్లు పని చేశారు. సుమారు తొమ్మిదేళ్ల తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 12న విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా గత ప్రభుత్వ పాలకుల సిఫారసుల మేరకు సీఐలకు పోస్టింగ్స్ ఇచ్చారనే విమర్శలున్నాయి. రేంజ్‌లో మొత్తం 22 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచారు. పలువురు సీఐలను టార్గెట్ చేసేవారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారని, ఈలోగా ప్రభుత్వం మారడంతో జూలై 17న అతనిని బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఆదేశించింది. కాగా విశాల్ గున్ని సస్పెన్షన్ స్వయంకృతాపరాధమేనని ఆ శాఖలోని పలువురు అధికారులు చర్చించుకుంటున్నారు.

రుణం పేరుతో వల..

సైబర్ నేరగాళ్ల నయా మోసం

- ఫేస్‌బుక్‌లో లోన్ యాప్ నోటిఫికేషన్‌లు
- క్లిక్ చేస్తే మోసగాళ్ల వలకు చిక్కినట్టే
- రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మొదట కొద్ది మొత్తం వసూలు
- ఆ తర్వాత ఆశల్లో ముంచుతూ విడతల వారీగా అందినంత దోపిడీ
- నగరంలో ఇటీవల పెరుగుతున్న కేసులు
- అన్నీ ఇతర దేశాల నుంచి నిర్వహిస్తున్నవే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు సెల్ ఫోన్‌లో ఫేస్‌బుక్ చూడడం అలవాటు. ఈనెల 10న ఫేస్‌బుక్ చూస్తుండగా ఇన్‌స్టెంట్ లోన్ అంటూ ఇండియా బుల్స్ పేరుతో ఒక నోటిఫికేషన్ కనిపించింది. దానిపై క్లిక్ చేయగానే రూ.3 లక్షలు వరకూ లోన్ ఇస్తామని ఉండడంతో వివరాలు ఎంటర్ చేశారు. అటు నుంచి బ్యాంకు ప్రతినిధినంటూ ఒకరు ఫోన్ చేసి విడతల వారీగా రూ.96 వేలు వరకూ గుంజేశారు.

రామ్‌నగర్‌కు చెందిన 26 ఏళ్ల స్టాఫ్ నర్సు కొద్దిరోజులు కిందట షటిల్ లోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లోన్ కోసం అప్లై చేశారు. వెంటనే ఆమెకు ఒకరు కాల్ చేసి లోన్ ఇస్తామని నమ్మించి దశల వారీగా రూ.20 వేలు లాగేశారు. ఇంకా కొన్ని ఫీజులు కట్టాలని కోరడంతో ఆమెకు మోసగాళ్ల పనేనని అర్థం కావడంతో అతని నంబర్‌ను బ్లాక్‌లో పెట్టేశారు.

నగరంలో ఇన్‌స్టెంట్ రుణాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్‌లో ఇన్‌స్టెంట్ లోన్ యాప్, వెబ్‌సైట్‌ల పేరుతో కొన్ని నోటిఫికేషన్‌లను పెడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, వెంటనే రుణం వచ్చేస్తుందని ఆ నోటిఫికేషన్ లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. లింక్‌ను క్లిక్ చేయగానే ఫోన్ నంబర్, రాష్ట్రం ఎంటర్ చేయాలని అడుగుతుంది. ఆ మేరకు తమ వివరాలను ఎంటర్ చేస్తున్నారు. ఫోన్ నంబర్ ఎంటర్ చేయగానే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. బాధితులకు ఫోన్ చేసి ఎంత రుణం కావాలని మాటలు మొదలుపెట్టి, వారికి ఆ క్షణంలోనే రుణం మంజూరు చేసేస్తున్నట్టు ఫోన్‌పే నంబర్, బ్యాంకు ఖాతా వివరాలను అడిగి హడావిడి చేస్తున్నారు. ఆ తరువాత లోన్ మంజూరు చేయడానికి ముందు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది కాబట్టి, ఫీజు కింద రూ.2,500 తాము చెప్పే నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు. రూ.మూడు లక్షలు/రూ.ఐదు లక్షలు రుణం ఇస్తున్నప్పుడు రూ.2,500 కట్టడం పెద్ద లెక్క కాదన్నట్టు సైబర్ నేరగాళ్లు చెప్పిన నంబర్‌కు లోన్ అవసరమైనవారు ఫోన్ పే చేసేస్తున్నారు. తర్వాత మరొకరు ఫోన్ చేసి లోన్ దరఖాస్తు అందిందని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రుణం కోసం ముందుగా కొంత ఫీజు కడితే, ఆ మొత్తంతోపాటు లోన్ మొత్తం కలిపి తిరిగి అకౌంట్‌కు జమ చేస్తామని నమ్మబలుకుతున్నారు. ఇలా బాధితులు మోసాన్ని గుర్తించేంత వరకూ డబ్బును ఏదో ఒక పేరుతో సైబర్ నేరగాళ్లు లాగేస్తున్నారు. ఈనెల పదిన మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు ఇదే తరహా అనుభవం ఎదురైంది. ఫేస్‌బుక్ చూస్తుండగా 'ఇండియా బుల్స్' పేరుతో ఒక ఇన్‌స్టెంట్ లోన్‌కు సంబంధించిన లింక్ కనిపించింది. ఆమె రూ.మూడు లక్షలు రుణం వస్తుందని ఆ లింక్‌ను క్లిక్ చేయగా, ఫోన్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను ఎంటర్ చేయాలని కోరారు. ఫోన్ నంబర్ ఇవ్వగానే ఒక వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్ నుంచి అని చెప్పి తెలుగులోనే మాట్లాడారు. రూ.3 లక్షలు రుణం ఇస్తామని అందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పి రూ.2,500 లాగేశారు. తర్వాత అనుమానం రాకుండా ఉండేందుకు బాధితురాలికి ఆర్‌బీఐ పేరుతో ఉన్న ఒక బాండ్‌ను వాట్సాప్‌కు పంపించారు. దీంతో రుణం వస్తుందనే ఆశతో ఉన్న ఆమె సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు విడతల వారీగా రూ.96 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఇంకా అడగడంతో తాను ఇప్పటికే అప్పులు చేసి కట్టానని, ఇక అప్పు ఇచ్చేవారు లేరని చెబుతుండగా పక్కింట్లో ఉండే వ్యక్తి విని..విషయం ఏమిటని ఆరా తీయగా జరిగిన ఉదంతాన్ని చెప్పారు. అదంతా మోసం...అని చెప్పడంతో బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో నేరగాళ్ల అకౌంట్‌లను ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులకు పోలీసులు మెయిల్ పంపించారు. రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక స్టాఫ్ నర్సుకు కూడా ఇదే తరహా అనుభవం ఎదురైంది. అయితే ఆమె ప్రాథమిక దశలోనే మోసాన్ని గుర్తించడంతో తక్కువ నష్టంతో బయటపడ్డారు. ఈ తరహా ఉదంతాలు నగరంలో ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. చాలామంది అమాయకులు లోన్ యాప్ నిర్వాహకుల ఉచ్చులో చిక్కుకుంటున్నప్పటికీ కొద్దిమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మిగిలినవారు పరువు పోతుందనే భయంతో ముందుకురావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

విదేశాల నుంచే యాప్‌ల నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బాధితులకు అనుమానం రాకుండా అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో పెట్టుకోవడం, ఏజెంట్ల ద్వారా అన్ని రాష్ట్రాలకు చెందిన సిమ్ కార్డులను సంపాదించడం చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఆ రాష్ట్రానికి చెందిన సిమ్ కార్డు నుంచి ఫోన్ చేసి, ఆ రాష్ట్ర భాషలో మాట్లాడిస్తారు. కాంబోడియా నుంచి ఇదే తరహా మోసాలకు పాల్పడే ముఠా చేతిలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన వందలాది మందిని నగర పోలీసులు ఇటీవల విడిపించి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

99 మీటర్లకు చేరిన కోనాం నీటిమట్టం


కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, సెప్టెంబరు 15: మండలంలో కోనాం జలాశయంలో వరదనీటిలో కళకళలాడుతుంది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా.. ఆదివారం ఉదయానికి 99 మీటర్లకు చేరుకుంది. ఈ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో 80 క్యూసెక్కులు వస్తుండగా ఎగువ, దిగువ కాలువలు, గేట్లు లీకేజీ రూపంలో 200 క్యూసెక్కులు బొడ్డేరు నదిలోకి వెళుతున్నది. ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ఏఈ సీహెచ్.జయరాం తెలిపారు.

వరద బాధితులకు లారస్ ల్యాబ్స్ రూ.కోటి విరాళం


సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందిస్తున్న లారస్ ల్యాబ్స్ సీఈవో సత్యనారాయణ

పరవాడ, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్ యాజమాన్యం కోటి రూపాయలు సమకూర్చింది. ఇందుకు సంబంధించిన చెక్కును లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నాగరాణి కలిసి ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేసినట్టు లారస్ ల్యాబ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్ విభాగం) బోడేపూడి రామకృష్ణ తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన వారికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందజేయాలని ఈ సందర్భంగా రామకృష్ణ పిలుపునిచ్చారు.

'బల్లా'కు తెలుగు వెలుగు నంది పురస్కారం


పురస్కారం అందుకున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : పట్టణానికి చెందిన సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో కాళోజీ స్మారక సంస్థ, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఆదివారం ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా నాగభూషణం అందిస్తున్న సేవలను గుర్తించి బీజేపీ అధికార ప్రతినిధి చందు సాంబశివరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఆకట్టుకున్న సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు


ప్రవచనాలను వినిపిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

కొత్తూరు, సెప్టెంబరు 15 : అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజైన ఆదివారం విశేష పూజలు జరిపారు. సామవేదం షణ్ముఖ శర్మ పరమేశ్వరి వైభవం ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉప్పల శ్రీనివాసరావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయాలి

- సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు


ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

సబ్బవరం, సెప్టెంబరు 15 : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు సూచించారు. మండలంలోని బోదివలస, మలునాయుడుపాలెం గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరి పంటతో పాటు ఈకేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసి నివేదిక పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఉద్యాన సహాయకులు బొబ్బరి లావణ్య, శ్రీనివాస్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సంప్రదాయబద్ధంగా పవిత్రాల సమర్పణ

సింహాచలం, సెప్టెంబరు 15 : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి పవిత్ర సమర్పణం జరిపారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. పవిత్ర సమర్పణ విశిష్టతను స్థానాచార్యులు రాజగోపాల్ మీడియాకు వివరిస్తూ శాస్త్రవిధిని అనుసరించి పవిత్రాలను పరిమిత సంఖ్య సూత్రాలతో (పట్టు దారాలతో) ఉత్తమ, మధ్యమ, అధమ అను మూడు పరిమాణాల్లో తయారు చేస్తారన్నారు. వాటిని పవిత్రోత్సవాల రెండవ రోజున అధివాసం చేసి మూడవ రోజున ఆలయంలోని మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు, ఆళ్వార్లులకు, ఆలయ శిఖరాలకు సమర్పిస్తారని చెప్పారు. ఈమేరకు రాత్రి దర్శనాలు నిలిపివేసిన తరువాత విశేష హోమాలు, చతుర్వేద పారాయణలు, పురాణ, ఇతిహాది విన్నపాలు అనంతరం పవిత్ర సమర్పణ చేశారు.

పెట్రో వర్సిటీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ శాశ్వత క్యాంపస్‌ను అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం మండలంలో ఉన్న వంగలి గ్రామంలో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్యాంపస్‌లోనే అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ వద్ద ఒక వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బోకం రామకృష్ణ తెలిపారు. పూడిమడక రోడ్డులో నివాసం ఉంటున్న దాడి అప్పారావు మద్యం దుకాణంలో శనివారం రాత్రి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి సంచిలో పట్టుకుని వెళుతున్నాడు. ఇంతలో అనుమానం వచ్చి సంచిని తనిఖీ చేయగా, పది మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

ఇష్టారాజ్యం.. చర్యలు పూజ్యం

- 'పేట' తాండవ నది వంతెనపై వాహనాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు జనం భయాందోళన



తాండవ వంతెనపై వరుసగా నిలిపిన వాహనాలు



పాయకరావుపేట, సెప్టెంబరు 15 : ఇక్కడి తాండవ నది వంతెనపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. ఇది చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. తాండవ నదిపై ఉన్న వంతెనపైకి పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన ప్రజలు సర్వీసు రోడ్లపై నుంచి వస్తుంటారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు వంతెనలు ఉన్న చోట్ల ఇరువైపులా సర్వీసు రోడ్లకు అనుసంధానంగా నేషనల్ హైవే అథారిటీ కొత్తగా వంతెనలు ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాయకరావుపేట వద్ద ఉన్న తాండవ నదిపై ఉన్న వంతెనకు ఇరువైపులా రెండు వంతెనలు ఏర్పాటుచేసి సర్వీసు రోడ్లకు అనుసంధానం చేశారు. దీంతో పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు వంతెనపైకి వెళ్లకుండానే నదిని దాటేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి. అయితే ఈ రెండు పట్టణాలకు చెందిన పలువురు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యజమానులు తమ వాహనాలను తాండవ వంతెనకు ఇరువైపులా ఉన్న వంతెలనపై రోజుల తరబడి నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రాకపోకలు సాగించేవారు భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, హైవే అధికారులు స్పందించి తాండవ వంతెనకు అనుసంధానంగా ఉన్న వంతెనలపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

వరద నీటి ప్రవాహానికి అటంకంగా వేసిన లే అవుట్‌ల అనుమతులు రద్దు చేయాలి

- ఆవఖండం పరిరక్షణ సమితి ప్రతినిధుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సమితి ప్రతినిధులు

కొత్తూరు, సెప్టెంబరు 15 : వరద నీటి ప్రవాహానికి ఆటకం కలిగేలా వేసిన లే అవుట్‌ల అనుమతులను రద్దు చేయాలని ఆవఖండ పరిరక్షణ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనకాపల్లి పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో సమితి కన్వీనర్ బుసి రాజు మాట్లాడారు. ఆవఖండంలో ఆవ గర్భంలోకి వరద నీరు ప్రవహించే దారికి అడ్డుగా ఎటువంటి నిర్మాణాలు జరిపినా అనకాపల్లి పట్టణంతో పాటు తుమ్మపాల, శంకరం ఆపై గ్రామాలన్నీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే ఆస్తి, ప్రాణనష్టం తప్పదని పేర్కొన్నారు. ఇటువంటివి తలెత్తకుండా ఉండేందుకు ఆవఖండంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు వైఎస్ భద్రం, కనిశెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, రాజాన దొరబాబు, శేఖరమంత్రుల సాయి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ప్రజా సంఘాల నివాళి



సీతారాం ఏచూరి చిత్రటం వద్ద ప్రజా సంఘాల ప్రతినిధుల నివాళి

రాంబిల్లి, సెప్టెంబరు 15 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాట యోధుడి ఆశయ సాధనకు అంతా కంకణబుద్ధులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి ప్రజా సంఘాల నాయకులు భూపతి అప్పారావు, వై.శ్రీనివాసరావు, కె.వి.రయణ, వై.రాము, సత్తిబాబు, సీహెచ్.రామకృష్ణ, గంగరాజు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 16 గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ఎస్. రాయవరం, సెప్టెంబరు 15 : మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధి పదహారు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా గుడివాడ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న గుడివాడ, గుర్రాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, పెద ఉప్పలం, చిన ఉప్పలం, రేవుపోలవరం, కొత్తపోలవరం, తిమ్మాపురం గ్రామాలకు ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగ, వమ్మవరం ఫీడర్ పరిధిలోని కొరుప్రోలు ఏజీఎల్, గెడ్డపాలెం, వమ్మవరం గ్రామాలకు ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, సోముదేవుపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్‌లో ఉదయం పదకొండు నుంచి మధ్యాహ్నం రెండు వరకు, గోకులపాడు ఫీడర్ పరిధిలో ఉన్న గోకులపాడు, భీమవరం గ్రామాలకు ఉదయం పదకొండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. అదేవిధంగా ధర్మవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధి ధర్మవరం గ్రామంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొంటూ వినియోగదారులంతా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థులు బాసట

సబ్బవరం, సెప్టెంబరు 15 : కష్టాల్లో ఉన్న చిన్ననాటి స్నేహితుడికి వారంతా అండగా నిలిచారు. మండలంలోని రావలమ్మపాలేనికి చెందిన సింగపల్లి శ్రీరామ్మూర్తి ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితం అయ్యాడు. ఇతని దుస్థితిని తెలుసుకున్న తన తోటి మిత్రులు రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 2000-01లో పదో తరగతి చదువుకున్నవారంతా రూ.25వేలను పోగు చేశారు. మూడు నెలలకు సరిపడా నిత్యాసర సరకులను ఆ కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట భాస్కర్, గొంప రామకృష్ణ, కె.రాంబాబు, సంతోష్, సోంబాబు తదితరుల పాల్గొన్నారు.

సాగునీటికి రైతుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

నీటి ప్రవాహం మందగించి ఆయకట్టు భూములకు నీరు సరిగా అందని పరిస్థితి నెలకొంది. మరోవైపు ముదు ములు, ఆయకట్టు భూములకు విడతల వారీగా నీరు అందించే రెగ్యులేటింగ్ గేట్లు పాడైపోయాయి. గుంటపల్లి కాలువపై గుంటపల్లి వద్ద మదుము పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మంగవరం కాలువపై మంగవరం వద్ద ఉన్న మదుము ఆనవాళ్లు లేకుండా ధ్వంసం అయ్యింది. ఇక్కడి నుంచి మెరక కాలువ, పల్లం కాలువ, కొముదుల కాలువ, చెరువు కింద కాలవలకు విడివిడిగా సుమారు 500 ఎకరాలకు నీరు అందాలి. కానీ మూడు గేట్లకుగాను ఒక్కదానికి కూడా తలుపులు లేకపోవడంతో పొలాలకు నీరు అందడంలేదు.

ప్రతిపాదనలు పంపించాం

పాయకరావుపేట మండలంలోని ఉప్పరగూడెం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం, మంగవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, రాజగోపాలపురం, గుంటపల్లి, గ్రామాల్లో సాగునీటి కాలువలకు సంబంధించి 29 గేట్ల మరమ్మతు లేదా కొత్త గేట్ల ఏర్పాటు కోసం రూ.34.37 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్‌నాటికి సాగునీటి పారుదలకు రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటాం.

జి.శ్రీరామమూర్తి, ఏఈఈ, జలవనరుల శాఖ

ఎటు చూసినా నిమ'జ్జనాలే..'

- అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన స్వామి వారిని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకు వెళ్లి అనుపోత్సవం



సబ్బవరం శివారు సూర్యానగర్‌లో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ పూజలు



ఎలమంచిలి వేద పాఠశాలలో గణపతికి లక్ష గరిక పూజ



ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెంలో వినాయక విగ్రహం నిమజ్జనోత్సవం





అనకాపల్లి, అచ్యుతాపురంలో గణపతికి బుద్ద.., ఎమ్మెల్యే సుందరపు పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : వినాయక నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగం గా ఆదివారం అనకాపల్లి పట్టణంలోని రింగు రోడ్డులో గల కొణతాల వారి వీధిలో గణనాథుడ్ని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. అలాగే, చినరాజుపేట, పెదరామస్వామికోవెల, వీసినికాడ గ్రామాల్లోనూ అన్న సమారాధనలు జరిపారు. వివిధ పార్టీ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధనలు జరిపారు. నక్కపల్లి, కొత్తపేట, ఉపమాక మెరకవీధి, పల్లపువీధి రామాలయాల ప్రాంగణంలో తొలుత స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధనలను ప్రారంభించారు. పలుచోట్ల లడ్డూ వేలం వేశారు.

ఎస్.రాయవరం : మండలంలోని గెడ్డపాలెం, దార్లపూడి, బంగారమ్మపాలెం, రేవుపోలవరం తదితర గ్రామాల్లో పలు చోట్ల ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఆయా విగ్రహాలను మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకు వెళ్లి నిమజ్జనం చేశారు.

ఎలమంచిలి : పట్టణంలోని కొత్తపేట చినరామకోవెల వద్ద ఏర్పాటు చేసిన పదమూడు అడు గుల గణనాథుడ్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే విజయకుమార్ దర్శించుకున్నారు. జనసేన, టీడీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, నాయకులు కొఠారు నరేష్, కరణం రవి, కమిటీ ప్రతినిధులు సతీష్, మిల్లర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వేదపాఠశాల ఆవరణలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి హోమం, లక్షగరికల పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస కులకర్ణే, పురోహితులు భాగవతుల సాయికుమార్, ఆకొండి సాయి శర్మ, ఎ.శ్రీనివాస శర్మ, వేద పాఠశాల విద్యార్థులు కలిసి ఈ పూజలను జరిపారు. గాయత్రి సేవా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్ల వీరభద్రరావు, పెద్దింటి సూర్యనారాయణ మూర్తిలతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన భక్తులు ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేశారు. 34 పంచాయతీల్లో సుమారు 150కి పైచిలుకు విగ్రహాలు ఏర్పాటుచేశారు. కొన్నిచోట్ల మూడు రోజులు, మరికొన్నిచోట్ల ఐదు రోజులు స్వామిని ఆరాధించారు. చాలాచోట్ల తొమ్మిదో రోజు ఆదివారం విగ్రహాలను మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకు వెళ్లి సముద్రం, నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలుచోట్ల అన్నమారాధనలు జరిపారు. ఇదిలావుంటే, అచ్యుతాపురం ఎస్‌టీబీఎల్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పూజలు నిర్వహించారు.

సబ్బవరం : వినాయక ఉత్సవాల్లో భాగంగా మొగలిపురం, సబ్బవరం శివారు సూర్యానగర్‌లలో ఏర్పాటు చేసిన మండపాల్లో స్వామివారిని మాజీ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదివారం దర్శించుకున్నారు. తొలుత పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. లగిశెట్టిపాలెం, నక్కవానిపాలెం, చినయాతపాలెం, పెదయాతపాలెం గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం నేత్రపర్వంగా సాగింది.

కోటవురట్లలో రూ.26 వేలు పలికిన స్వామివారి లడ్డూ



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు

కోటవురట్ల : మండల కేంద్రం కోటవురట్ల సీతరామరాజు నగర్‌లో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి విగ్రహం వద్ద ఉంచిన 18 కేజీల లడ్డూను ఆదివారం రాత్రి వేలం వేశారు. సామాల వెంకట రాజగోపాల్ అనే భక్తులు రూ.26 వేలకు ఈ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. లడ్డూ దాతలు మామిడి సత్యనారాయణ, యశ్వంత్ కుమార్‌లు పాట అనంతరం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశుభ్రతకు వినూత్న ప్రయత్నం

ఎలమంచిలి, సెప్టెంబరు 15 : పట్టణంలోని కొత్తపేటలో ఓ క్రీడా మైదానంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పలువురు క్రీడాకారులు వినూత్న ప్రయత్నం చేశారు. ఆ ప్రాంతానికి చెందిన పలువురు తమ పెంపుడు కుక్కలను ఉదయం వేళ కాలకృత్యాల కోసం తీసుకు వస్తుండడంతో ఆయా పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. ఇది గుర్తించిన క్రీడాకారులు వినూత్న ఆలోచనచ చేశారు. అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇది పిల్లలు ఆడే ప్రదేశం.. దయచేసి ఇటుగా కుక్కలను తీసుకు రావద్దు అనే సందేశాన్ని అందులో పేర్కొన్నారు. దీంతో అటుగా వెళ్లే వారంతా ఆ ఫ్లెక్సీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.



సత్యసాయి ప్రార్థన మందిరం ప్రారంభం



మందిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

కశింకోట, సెప్టెంబరు 15 : ఇక్కడి కోమటి వీధిలో నూతనంగా నిర్మించిన సత్యసాయి సేవా, ప్రార్థన మందిరం ఆదివారం ప్రారంభమైంది. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కశింకోట, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు కశింకోట హౌసింగ్ కాలనీలో ముత్యాలమ్మ సేవా సమితి సభ్యులు గత నాలుగు రోజులుగా ఇంటింటికీ వెళ్లి బియ్యం, డబ్బులు సేకరించారు. వీటిని సుమారు 80 బాధిత కుటుంబాలకు అందించే విధంగా 20 కిలోల బియ్యం, కిలో గోధుమ పిండి, కిలో కందిపప్పు, అరకిలో సేమ్యా తదితరాలను ప్యాకింగ్ చేసి వ్యాన్ ద్వారా ఆదివారం పంపించారు. ఈ కార్యక్రమంలో నూకాలమ్మ, శిష్టి రాజు, మంగా రంజిత్, శ్రీనివాస్, దర్శి రమేష్, అమ్మిశెట్టి లక్ష్మణ్‌కుమార్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

'రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

పరవాడ, సెప్టెంబరు 15 : పరవాడ నుంచి భరిణికం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని మల్లోడి గెడ్డలో రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ రసాయనాలు విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం ఆయన మల్లోడిగెడ్డలో ఉన్న ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా రాంకీ యాజమాన్యం నేరుగా మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వివిధ పోటీల విజేతలకు బహుమతులు

పరవాడ, సెప్టెంబరు 15 : ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మా పునరావాస కాలనీలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆదివారం పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, స్థానిక నాయకులు ప్రభాకర్‌రావు, దామురోతు నరసింగరావు, చందక కృష్ణ, బి.శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

బాలకృష్ణ ఫ్యాన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన బాలకృష్ణ అభిమానులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం నందమూరి కుటుంబం ఫ్యాన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ ఫ్యాన్స్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా పొలిమేర నాయుడు, అధ్యక్షుడిగా మళ్ల సంతోష్, కార్యదర్శిగా విల్లూరి అప్పలనాయుడు, కోశాధికారిగా దూలం ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అభిమానులు మళ్ల గణేష్, కె.శ్రీను, వేగి వెంకటరావు, బోడి వెంకటరావు, మద్దాల భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ 'బోదెపు' జన్మదిన వేడుకలు



పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, సెప్టెంబరు 15 : ఎంపీపీ బోదెపు గోవింద్ జన్మదిన వేడుకలను ఆదివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణబాబు, కొఠారు గోవింద్, గొర్లె వెంకట్, కొల్లి త్రినాథ్, దూది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

... 5వ పేజీ తరువాయి

డిపార్టుమెంట్ మేజర్ సబ్జెక్ట్‌గా, ఎంపిక చేసుకున్న డిపార్టుమెంట్ మైనర్ సబ్జెక్ట్‌గా ప్రస్తుతం అమలు చేస్తు న్నారు. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం ఈ అవకాశం కల్పిస్తున్నారు. మైనర్ డిగ్రీ పొందాలనుకునే విద్యార్థులు రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా నాలుగు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇనుస్ట్రుమెంటేషన్, కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెటలర్జీ, మెరైన్, పర్యావరణ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్ అందించనున్నారు. వీరికి డేటా స్ట్రక్చర్, సీ లాంగ్వేజ్, పైథాన్, మ్యాట్ లాబ్ వంటి కోర్సులు నేర్పిస్తారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీఎస్ఈ చదివే అవకాశం ఇవ్వనున్నారు. మూడు, నాలుగో ఏడాదిలో మైనర్ డిగ్రీ చదివాల్సి ఉంటుంది.

నేటి నుంచి ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు రక్షణ యాత్ర

అచ్యుతాపురం, సెప్టెంబరు 15 : ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతపై సీపీఎం తలపెట్టిన రక్షణ యాత్రను అంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ విడుదల చేసి మాట్లాడారు. సోమవారం ఈ యాత్రను ప్రారంభించి ఐదు రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. పాయకరావుపేట నుంచి పరవాడ వరకు ఈ యాత్ర సాగుందని చెప్పారు. చివరి రోజు 20న అచ్యుతాపురంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. నాయకులు రాము, అప్పారావు, సోమునాయుడు, చేపల తాతలు, లక్ష్మి, రామకృష్ణ, మంగతాయారు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

'నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వామనమూర్తి

కొత్తూరు, సెప్టెంబరు 15 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన 2023 నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీ యూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ ధరలు ఒకే విధంగా అమలు చేయాలని, జాతీయ రహదారులపై పెట్టిన టోల్ గేట్లు ఫీజులను నియంత్రించాలని కోరారు. అలాగే, భారీగా పెంచిన ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ తగ్గించాలని, ప్రమాదకరంగా ఉన్న రోడ్లను వేసి వాహనదారులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇవే డిమాండ్లతో ఈనెల 24, 25 తేదీల్లో బెంగళూరులో జరగనున్న ఆలిండియా మోటర్ వర్కర్స్ జాతీయ మహా సభలను అంతా జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ, నాయకులు కృష్ణ, పల్లా నర్సింగరావు, సూరి అప్పారావు, సిహెచ్.రాము, బి.సత్తిబాబు, సుబ్బు, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

చోడవరం వైపు నుంచి నర్సీపట్నం వెళ్లే వారు కూడా ఆటోల్లో వడ్డాది చేరుకుని ఇక్కడి నుంచి బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఆటోలు సైతం చోడవరం నుంచి గౌరీపట్నం మీదుగా వడ్డాది చేరుకోవాల్సి రావడంతో ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక అనకాపల్లి -మాడుగుల, కింతలి-అనకాపల్లి, పాడేరు-విశాఖపట్నం బస్సులు సింగిల్ రోడ్డు అయిన విజయరామరాజుపేట, అప్పలరాజుపురం, వంటర్లపాలెం, కె.జె.పురం మీదుగా మాడుగులకు చేరుకుంటున్నాయి. మరికొన్ని బస్సులు అప్పలరాజుపురం, బొయిపాడు మీదుగా చోడవరం చేరుకుంటున్నాయి. పాడేరు- విశాఖ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు తగ్గించారు. వడ్డాది జంక్షన్ మీద నుంచి కాకుండా కే.జె.పురం మీదుగా ప్రయాణిస్తుండడంతో రానుపోను 25 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులను సత్వరమే చేపట్టి, తమ ఇబ్బందులు తొలగించాలని మూడు జిల్లాలకు చెందిన ప్రయాణికులు కోరుతున్నారు. కాగా తాచేరు నదిలో వరద ప్రవాహం తగ్గినప్పటికీ డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంపై ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ విభాగం ఏఈఈ సత్యప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పనులు చేపట్టడానికి సామగ్రి సిద్ధంగా వుందని, రెండు మూడు రోజుల్లో పనులు మొదలు పెడతామని చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన హిందీ ప్రచార సభ పరీక్షలు

పాయకరావుపేట, సెప్టెంబరు 15 : దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం ఇక్కడ ప్రశాంతంగా ముగిశాయి. సన్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలను పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ కె.ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో శని, ఆదివారాలు పరిచయ నుంచి ప్రవీణ ఉత్తరార్థ వరకు ఎనిమిది రకాల హిందీ పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు.

ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

కొరత ఉందని, అయినా ఎక్కడా సేవలకు లోపంలేకుండా పనులు చేయిస్తున్నామని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్నా గృహ వినియోగదారులైతే ఆరు గంటల సమయంలోనే దానిని పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు వారికి ఏ సమస్య ఉన్నా 1912 నంబరుకు కాల్‌చేస్తే ఫిర్యాదు స్వీకరిస్తారని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, వాటిని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తుంటారని సీఎండీ తెలిపారు.

ఏ పని ఉన్నా అధికారులనే సంప్రతించండి

విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి పనులు ఉన్నా స్థానికంగా ఉంటే ఏఈ కార్యాలయంలో సంప్రతించాలని, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వారే సూచిస్తారని సీఎండీ వివరించారు. విద్యుత్ పనులు చేయిస్తామని దళారులు చాలామంది వెంటపడతారని, వారిని నమ్మవద్దని సూచించారు. అలా చేస్తే కాలయాపనతో పాటు ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుందన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నాతవరం, సెప్టెంబరు 15 : మండలంలోని వివిధ పంచాయతీలలో అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చిన గొలుగొండపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. చెర్లోపాలెం పంచాయతీలో డ్రైనేజీలు ఏర్పాటుకు రూ.6.8కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మాసయ్యపేట నుంచి కాకినాడ జిల్లా రోడ్డుకు రూ.కోటి 48 లక్షలు తాళ్లపాలెం-వడపర్తి రోడ్డుకు రూ.కోటి 40 లక్షలు, రాజుపేట అగ్రహారం నుంచి ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.73 లక్షలు, వెదురుపల్లి-గొలుగొండ రోడ్డుకు రూ.68 లక్షలు, మండలంలో శ్మశానాల అభివృద్ధికి రూ.కోటి 50 లక్షలు, తాండవ గేట్లు రిపేరుకు రూ.20 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అలాగే మండలంలో సీసీ రోడ్లకు రూ.9 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అలాగే 2014-2019 మధ్యలో హౌసింగ్ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు రావలసిన సిమెంట్స్ ప్రభుత్వం నిలిపివేసిందని, ప్రస్తుతం లబ్ధిదారుల వద్దకు అధికారులు వస్తున్నారని, వారిచ్చే నివేదిక మేరకు పెండింగ్ బకాయిలు మంజూరు చేస్తారన్నారు. విలేకర్ల సమావేశంలో సింగంపల్లి సన్యాసిదేముడు, అపిరెడ్డి మాణిక్యం, శెట్టి గోపీ చింతకాయల శ్రీను, పిని రెడ్డి జోగారావు పాల్గొన్నారు.

బోరు తవ్వారు.. హెడ్ మరిచారు

▸▸ వెంకయ్యపాలెంలో తాగునీటికి ఇక్కట్లు



వెంకయ్యపాలెంలో బోరు తవ్వి వదిలివేసిన దృశ్యం

మాకవరపాలెం, సెప్టెంబరు 15 : ఎన్నికల ముందు హడావిడిగా స్థానిక వైసీపీ నాయకులు బోరును వేయించినా నేటి వరకూ హెడ్‌ను మాత్రం బిగించలేదు. మండలంలో రామన్నపాలెం శివారు వెంకయ్యపాలెంలో సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నాయకులు తాగునీటి బోరు తవ్వించారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో తవ్విన బోరుకు హెడ్‌ను మాత్రం బిగించకుండా వదిలివేశారు. అసలే మెట్ట ప్రాంతం కావడంతో గ్రామంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ఉన్న తాగునీటి బోర్లు కొన్ని మరమ్మతులకు గురికావడం, మరికొన్ని బోర్లు తాగునీరు అంతంత మాత్రం వస్తున్నాయని మహిళలు చెబుతున్నారు. అధికారులు స్పందించి తవ్విన బోరుకు హెడ్ బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

వృథాగా బస్టాండ్ మరుగుదొడ్లు

▸▸ నీటి సదుపాయం కల్పించని అధికారులు

▸▸ ఇబ్బంది పడుతున్న మహిళా ప్రయాణికులు



బస్‌స్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

మాకవరపాలెం, సెప్టెంబరు 15 : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నీటి సదుపాయం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రతి రోజూ బస్టాండ్ నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, లంకెలపాలెంలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునే ప్రదేశంలో చెత్తా చెదారం పేరుకుపోయి ఉంటోంది. రాత్రి సమయాల్లో విద్యుత్ సౌకార్యం లేకపోవడంతో ప్రయాణికులు సెల్‌ఫోన్లు లైటింగ్ వేసుకొని బస్సు కోసం వెయిటింగ్ చేస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాగునీటికి రైతుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

నీటి ప్రవాహం మందగించి ఆయకట్టు భూములకు నీరు సరిగా అందని పరిస్థితి నెలకొంది. మరోవైపు ముదు ములు, ఆయకట్టు భూములకు విడతల వారీగా నీరు అందించే రెగ్యులేటింగ్ గేట్లు పాడైపోయాయి. గుంటపల్లి కాలువపై గుంటపల్లి వద్ద మదుము పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మంగవరం కాలువపై మంగవరం వద్ద ఉన్న మదుము ఆనవాళ్లు లేకుండా ధ్వంసం అయ్యింది. ఇక్కడి నుంచి మెరక కాలువ, పల్లం కాలువ, కొముదుల కాలువ, చెరువు కింద కాలవలకు విడివిడిగా సుమారు 500 ఎకరాలకు నీరు అందాలి. కానీ మూడు గేట్లకుగాను ఒక్కదానికి కూడా తలుపులు లేకపోవడంతో పొలాలకు నీరు అందడంలేదు.


ప్రతిపాదనలు పంపించాం

జి.శ్రీరామమూర్తి, ఏఈఈ, జలవనరుల శాఖ

పాయకరావుపేట మండలంలోని ఉప్పరగూడెం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం, మంగవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, రాజగోపాలపురం, గుంటపల్లి, గ్రామాల్లో సాగునీటి కాలువలకు సంబంధించి 29 గేట్ల మరమ్మతు లేదా కొత్త గేట్ల ఏర్పాటు కోసం రూ.34.37 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్‌నాటికి సాగునీటి పారుదలకు రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటాం.



మాడుగుల ఎంఈవో కార్యాలయం



శ్లాబ్ పెచ్చులూడిన గది

కారిపోతున్న ఎంఈవో కార్యాలయం

▸▸ పెచ్చులూడిన భవనం శ్లాబ్

▸▸ వర్షం పడితే గదులన్నింటిలో నీరే

▸▸ చెమ్మగిల్లుతున్న గోడలు, గచ్చు

▸▸ ఇబ్బంది పడుతున్న సిబ్బంది

▸▸ విద్యుత్ ఎర్త్ రావడంతో సిబ్బంది ఆందోళన

మాడుగుల రూరల్, సెప్టెంబరు 15 : మాడుగుల విద్యాశాఖాధికారి కార్యాలయ భవనం కారిపోతున్నది. శ్లాబ్ పెచ్చులూడిపోవడంతో వర్షం పడితే ఆ నీరంతా గదుల్లో కారిపోతున్నది. గదులు చెమ్మగిల్లుతున్నాయి. ఈ భవనంలో మూడు గదులు ఉన్నాయి. ఇందులో ఒకటి ఎంఈవో గది. మరో రెండు చిన్న గదులు కంప్యూటర్ ఆపరేటర్, సిబ్బందికి, మరొక పెద్ద గది పుస్తకాలు ఉంచేందుకు, ఉపాధ్యాయులు సమావేశం అయ్యేందుకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం శ్లాబ్ పెచ్చులూడి వర్షాలు పడితే వర్షం నీరు కారిపోతున్నది. పుస్తకాలు ఉంచే గది గోడలు చెమ్మగిల్లుతున్నాయి.



గదిలో చేరిన వర్షం నీటిని గుడ్డతో తొలగిస్తున్న సిబ్బంది

ఇటీవల కురిసిన వర్షాలకు శ్లాబ్ నుంచి వర్షం నీరు ధారలా కారిపోయి గదుల్లో నీరు చేరింది. గోడలు, గచ్చులు కూడా చెమ్మగిల్లాయి. దీంతో అక్కడి సిబ్బంది వర్షం నీటిని గుడ్డతో వత్తి నీరు బయట పారబోయాల్సి వచ్చింది. వర్షాలకు గచ్చులు, గోడలు చెమ్మగిల్లడంతో విద్యుత్ సరఫరా వల్ల ఎర్త్ అవుతుందని సిబ్బంది చెబుతూ ఆందోళన చెందుతున్నారు.

కారిపోతున్న గదుల్లో ఉండలేక గత్యంతరం లేక పుస్తకాలు ఉంచే గదిలోనే కంప్యూటర్లు, పుస్తకాలు, సామగ్రి ఉంచి సర్దుబాటు చేసుకుంటున్నారు. వర్షాల సమయంలో చాలా ప్రమాదకరంగా ఉందని వాపోతున్నారు. దీనిపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సొసైటీలను పటిష్టం చేసే బాధ్యత ఉద్యోగులదే

▸▸ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జీఎం శ్రీనివాసరావు

చోడవరం, సెప్టెంబరు 15: సహకార సంఘాలను పటిష్టం చేసే బాధ్యత ఉద్యోగులపైనే ఉందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండలంలోని వెంకన్నపాలెంలో డీసీసీబీ మేనేజర్ భూపతిరాజు శ్రీనివాసరాజు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సహకారం అందించడంలో సహకార సంఘాలు ముందున్నాయని, ఉద్యోగుల సంక్షేమానికి కూడా బ్యాంకు అంతే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థ పట్ల అంకితభావంతో పనిచేసిన మేనేజర్ శ్రీనివాసరాజు సేవలను ఆయన ప్రశంసించారు. శ్రీనివాసరాజు వంటి అధికారుల వల్ల సహకార బ్యాంకుకు గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసరాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసరాజు దంపతులను జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొడేడ్డ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి ఎల్లపు లక్ష్మణ, జిల్లా సహకార బ్యాంకు ఉద్యోగులు శరగడం సాయి, బ్రాంచి మేనేజర్లు, గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు.



పదవీ విరమణ చేసిన మేనేజర్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ జీఎం శ్రీనివాసరావు

అసంపూర్తిగా గిడుతూరు హైస్కూల్ భవనం

▸▸ శ్లాబ్ వేసిన తర్వాత పనులు నిలిపివేత

▸▸ మూడేళ్లుగా సాగుతునే ఉన్నాయి..

▸▸ పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

▸▸ తరగతి గదులు చాలక విద్యార్థులకు ఇక్కట్లు

▸▸ త్వరితగతిన పూర్తి చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

మాకవరపాలెం, సెప్టెంబరు 15 : నాడు-నేడు పథకంలో చేపట్టిన పాఠశాల భవన నిర్మాణ పనులు మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని గిడుతూరు హైస్కూల్‌లో నాడు-నేడు పథకంలో రూ.30 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. శ్లాబ్ వేసిన తర్వాత భవన నిర్మాణాన్ని వదలి వేశారు. నిధులు ఉన్నప్పటికీ పనులు చేపట్టకపోవడంపై విద్యార్థులు, తల్లిద్రండులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో తరగతి గదులు చాలక వరండాల్లో విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



శ్లాబ్ వేసి వదిలేసిన గిడుతూరు హైస్కూల్‌లో తరగతి భవనం

తాటి తీగెల్లో పోషకాలు

▸▸ తీగెల తయారీలో రైతులు నిమగ్నం

▸▸ తాటిపండ్లకు మట్టిలో పాతర

▸▸ ప్రతి పండు నుంచి రెండు మూడు మొలకలు

▸▸ ఈ మొలకలు ఆరోగ్యానికి ఎంతో మేలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15: మండలంలో పలు గ్రామాల్లో తాటి తీగెల తయారీకి రైతులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం తాటి పండ్లను సేకరించి కుప్పలుగా పోసి తీగెల పాతరలు వేస్తున్నారు. ఈ తీగెలు తింటే మంచి పోషకాలు లభిస్తాయి.

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో తాటికాయలు లభిస్తాయి. తాటి కాయలను వేసవి తాపం నుంచి ఉపశమనానికి ప్రజలు తింటారు. తాటి ముంజులు కూడా ఎక్కువగా తింటారు. అయితే ఈ తాటి పండ్లను ఆగస్టు, సెప్టెంబరు నాటికి ముదిరిపోయి పండ్లుగా మారతాయి. ఈ పండ్లు చెట్లు నుంచి రాలి తాటి చెట్ల కింద పడి ఉంటాయి. మండలంలోని దిబ్బిడి, గొన్నవానిపాలెం, కొండెంపూడి, బంగారుమెట్ట, రాజాం, కందిపూడి తదితర గ్రామాల్లో రైతులు ఇటువంటి తాటి పండ్లను సేకరించి పోగులుగా పోసి తీగెలకు పాతర వేస్తారు. తయారైన తీగెలు తీసుకోవడానికి అనువుగా ఎత్తుగా మట్టిదిబ్బలు తయారు చేసి వాటి మధ్యలో తాటిపండ్లను పెట్టి మట్టితో కప్పుతారు. ఒకొక్క తాటిపండు నుంచి రెండు, మూడు మొలకలు వస్తాయి. ఇది భూమిలోనే పెరగడంతో తీగెలుగా పిలుస్తారు. డిసెంబరు నెలాఖరు, జనవరి మొదటి వారం నాటికి తీగెలు సిద్ధమవుతాయి. ఈ తెగల్లో బి1, బి3, సి విటమన్లతోపాటు శరీరానికి అవసరమయ్యే పొటాసియం, ఒమేగా 3 కాల్షియం పుష్కలంగా ఉండి కాలరీలు తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారు వీటిని తింటుంటారు. ఫైబర్ సమృద్ధిగా ఉండడం వలన రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గి, రక్తావృద్ధి చెందుతుంది. చక్కెర స్థాయిలను నియంత్రించే తీగెలకు మంచి డిమాండ్ ఏర్పడింది. పిల్లలు నుంచి పెద్దల వరకు ప్రజలు ప్రీతిపాత్రంగా తీగెల తింటుండం, మార్కెట్లో వీటికి మంచి ధర లభ్యం కావడంతో రైతులు తీగెల పాతరలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.



తాటి పండ్లను పాతర వేస్తున్న మహిళ

ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

కొరత ఉందని, అయినా ఎక్కడా సేవలకు లోపం లేకుండా పనులు చేయిస్తున్నామని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్నా గృహ వినియోగదారులైతే ఆరు గంటల సమయంలోనే దానిని పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు వారికి ఏ సమస్య ఉన్నా 1912 నంబరుకు కాల్ చేస్తే ఫిర్యాదు స్వీకరిస్తారని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, వాటిని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తుంటారని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

ఏ పని ఉన్నా అధికారులనే సంప్రతించండి

విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి పనులు ఉన్నా స్థానికంగా ఉంటే ఏఈ కార్యాలయంలో సంప్రతించాలని, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వారే సూచిస్తారని సీఎండీ వివరించారు. విద్యుత్ పనులు చేయిస్తామని దళారులు చాలామంది వెంటపడతారని, వారిని నమ్మవద్దని సూచించారు. అలా చేస్తే కాలయాపనతో పాటు ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుందన్నారు.

రూ.26 వేలు పలికిన స్వామివారి లడ్డు

కోటవురట్ల : స్థానిక సీతారామరాజు నగర్‌లో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి విగ్రహం వద్ద ఉంచిన 18 కేజీల లడ్డూను ఆదివారం రాత్రి వేలం వేశారు. సామాల వెంకట రాజగోపాల్ అనే భక్తులు రూ.26 వేలకు ఈ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. లడ్డూ దాతలు మామిడి సత్యనారాయణ, యశ్వంత్ కుమార్‌లు పాట అనంతరం ఆయనకు అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

చోడవరం వైపు నుంచి నర్సీపట్నం వెళ్లే వారు కూడా ఆటోల్లో వడ్డాది చేరుకుని ఇక్కడి నుంచి బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఆటోలు సైతం చోడవరం నుంచి గౌరీపట్నం మీదుగా వడ్డాది చేరుకోవాల్సి రావడంతో ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక అనకాపల్లి-మాడుగుల, కింతలి-అనకాపల్లి, పాడేరు-విశాఖపట్నం బస్సులు సింగల్ రోడ్డు అయిన విజయరామరాజుపేట, అప్పలరాజుపురం, వంటర్లపాలెం, కె.జె.పురం మీదుగా మాడుగులకు చేరుకుంటున్నాయి. మరికొన్ని బస్సులు అప్పలరాజుపురం, బొయిపాడు మీదుగా చోడవరం చేరుకుంటున్నాయి. పాడేరు-విశాఖ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు తగ్గించారు. వడ్డాది జంక్షన్ మీద నుంచి కాకుండా కే.జె.పురం మీదుగా ప్రయాణిస్తుండడంతో రానుపోను 25 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. డ్రైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులను సత్వరమే చేపట్టి, తమ ఇబ్బందులు తొలగించాలని మూడు జిల్లాలకు చెందిన ప్రయాణికులు కోరుతున్నారు.

కాగా తాచేరు నదిలో వరద ప్రవాహం తగ్గినప్పటికీ డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంపై ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సత్యప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పనులు చేపట్టడానికి సామగ్రి సిద్ధంగా వుందని, రెండు మూడు రోజుల్లో పనులు మొదలు పెడతామని చెప్పారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

... 5వ పేజీ తరువాయి

డిపార్టుమెంట్ మేజర్ సబ్జెక్ట్‌గా, ఎంపిక చేసుకున్న డిపార్టుమెంట్ మైనర్ సబ్జెక్ట్‌గా ప్రస్తుతం అమలు చేస్తున్నారు. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం ఈ అవకాశం కల్పిస్తున్నారు. మైనర్ డిగ్రీ పొందాలనుకునే విద్యార్థులు రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా నాలుగు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇనుస్ట్రుమెంటేషన్, కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెటలర్జీ, మెరైన్, పర్యావరణ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్ అందించనున్నారు. వీరికి డేటా స్ట్రక్చర్, సీ లాంగ్వేజ్, పైథాన్, మ్యాట్ లాబ్ వంటి కోర్సులు నేర్పిస్తారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీఎస్ఈ చదివే అవకాశం ఇవ్వనున్నారు. మూడు, నాలుగో ఏడాదిలో మైనర్ డిగ్రీ చదవాల్సి ఉంటుంది.

☛ సంక్షిప్తంగా..

కోతులను పట్టాలని కోరుతూ 18న ఆందోళన

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 15 : కోతులను పట్టాలని కోరుతూ ఈనెల 18వ తేదీన నర్సీపట్నం డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్టు రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకా సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోతులు విద్యార్థులు, ప్రజలపై దాడులు చేయడంతోపాటు రైతులు పండించే పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. వీటిపై పలుమార్లు అధికారులు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. కోతుల దాడుల్లో పంటలు నాశనమైతే అటవీ శాఖ నష్టపరిహారం ఇవ్వాలని, కోతులను పట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు సహకరించాలని సత్యనారాయణ కోరారు.

ఎకనామిక్స్ అధ్యాపకుడిని డిప్యూటేషన్‌పై నియమించండి

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 15: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో సీఈసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుకునే 90 మంది విద్యార్థులు ఆ సబ్జెక్టు దూరమయ్యారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కళాశాల ప్రిన్సిపాల్ తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. కళాశాలలో ఇప్పటికే యూనిట్ పరీక్షలు జరిగాయని, త్వరలో జరిగే మిగతా పరీక్షల్లో విద్యార్థులు ఏమి చదివి ఎకనామిక్స్ పరీక్ష రాస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల నుంచి ఎకనామిక్స్ అధ్యాపకురాలు ప్రసూతి సెలవులో ఉన్నారని, ఆమె మళ్లీ విధుల్లో చేరే సమయానికి పబ్లిక్ పరీక్షలు వస్తాయని విద్యార్థులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎకనామిక్స్ అధ్యాపకుడిని డిప్యూటేషన్ వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జ్వరంతో సచివాలయ ఏఎన్ఎం మృతి



మృతిచెందిన సత్యవతి

నాతవరం, సెప్టెంబరు 15 : స్థానిక సచివాలయం-1 లో పనిచేస్తున్న ఏఎన్ఎం వై.సత్యవతి (45) జ్వరంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గత మూడు రోజుల నుంచి ఏఎన్ఎం సత్యవతి జ్వరంతో బాధ పడుతుండగా రెండు రోజుల క్రితం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు



దేవరాపల్లి వినాయక చవితి నిర్వాహకులను అభినందిస్తున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ కాలనీలో మాజీఎంపీపీ భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, చల్లా తాతయ్యలు యువకులు పాల్గొన్నారు. నాగయ్యపేటలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు. అన్న సమారాధన నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముగ్గుల పోటీ విజేతలకు చీరలు పంపిణీ



విజేతలకు చీరలు పంపిణీ చేస్తున్న శెట్టి మంగ తదితరులు

నాతవరం, సెప్టెంబరు 15: స్థానిక కొత్తవీధిలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ విజేత కొమ్మన పావనీ, ద్వితీయ విజేత అంకంరెడ్డి శిరీష, తృతీయ విజేత నాగజ్యోతిలకు శెట్టి మంగ చేతుల మీదుగా చీరలు అందజేశారు. అలాగే చవితి ఉత్సవాలను దగ్గరుండి రోజుకో కార్యక్రమం ఏర్పాటు చేసిన జి.లావణ్య, రాజా దంపతులను భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెట్టి నానాజీ, పారుపల్లి కృష్ణవేణి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరంలో 115 మందికి పరీక్షలు



చీడికాడలో కంటి తనిఖీలు చేస్తున్న వైద్యుడు సురేష్

చీడికాడ, సెప్టెంబరు 15: మండల కేంద్రంలో ఆదివారం ఇట్స్‌మై విలేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు సురేష్ 115 మందికి కంటి పరీక్షలు చేయగా.. 48 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి ప్రముఖ వైద్య నిపుణులచే చికిత్స చేయించనున్నట్టు క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇట్స్‌మై విలేజ్ సంస్థ సభ్యులు బొబ్బిలి మధు, సిరికి నగేష్, కె.శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐ భీమరాజును మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేతలు

నాతవరం, సెప్టెంబరు 15 : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన భీమరాజును ఆదివారం జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో ఎస్ఐ భీమరాజు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేరాలు అరికట్టడానికి సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని జనసేన నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బైన మురళి తదితరులు పాల్గొన్నారు.